



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

లింకు నొక్కారో.. ఖాతా ఖాళీ..!



- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్న ప్రజలు
- బ్యాంకుల్లో నగదును కోల్పోతున్న జనం
- రోజురోజుకూ పెరిగిపోతున్న బాధితులు
- అధికంగా మోసపోతున్నది విద్యావంతులే!
- జిల్లాలో 699 ఫిర్యాదులు, 141 కేసుల్లో రూ.56.86 లక్షలు రికవరీ

నర్సింహులపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమవుతోంది. శాస్త్రసాంకేతిక రంగాల్లో మార్పులు వస్తోండటంతో మోసాలూ అంతేస్థాయిలో పెరుగుతున్నాయి. స్మార్ట్ ఫోనే ప్రపంచమైన వేళ.. ప్రజలు సైబర్ నేరగాళ్లకు అడ్డంగా దొరికిపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, వినూత్న రీతిలో వాళ్ల ఉచ్చులో చిక్కుకొని డబ్బులను పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త అవతారం ఎత్తుతూ తెలిసిన వ్యక్తుల్లా.. సంబంధిత అధికారులమంటూ చెప్పుకుంటూ, జనాల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోని విద్యావంతులు, వ్యాపారులు, సంపన్నులు అధిక శాతం మోసపోతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 699 సైబర్ ఫిర్యాదులు అందగా, పుటాన్ హోల్డ్ ఫిర్యాదులు 206, ఎఫ్ఐఆర్ 106, పీటీ వారెంట్లు 7 చొప్పున కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు 141 కేసుల్లో రూ.56,86,808 నగదును రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

మోసపోతున్నది అక్షరాస్యులే.!

సైబర్ నేరగాళ్ల చేతిలో విద్యావంతులు, వ్యాపారులు, సంపన్నులే అధికంగా మోసపోతున్నారు. సైబర్‌క్రైం పోలీసులు సైబర్ నేరాల నివారణకు పట్టణాలు మొదలుకొని మారుమూల ప్రాంతాల వరకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ.. అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త అవతారంలో ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి నగదు దోచేస్తుండడం గమనార్హం. స్మార్ట్ ఫోన్ వాడకంలో అనవసరమైన లింకులను నొక్కకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న 'ఆన్‌లైన్' మోసాలు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ 'ఆన్‌లైన్' మోసాలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త అవతారం ఎత్తి, జనాల బ్యాంకు ఖాతాలను దోచేస్తున్నారు. నర్సింహులపేట మండలంలో మినీ బ్యాంకు నిర్వాహకుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.80 వేలు, కొమ్ములవంచ గ్రామానికి చెందిన చీకటి రమేష్ రూ.60 వేలు, పడమటిగూడెం గ్రామానికి చెందిన మహేష్ రూ.7.40 లక్షలు, డోర్నకల్ మండలంలో ఓ రైతు రూ.1.10లక్షలు, మరిపెడ మండలంలో ఓ వ్యాపారుడు రూ.1.80 లక్షలు చొప్పున మోసపోయారంటే 'ఆన్‌లైన్' మోసాలకు అద్దం పడుతోంది.



మానుకోటలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి (ఫైల్)

ప్రజలను అవగాహన పరుస్తున్నా..

జిల్లా వ్యాప్తంగా సైబర్ మోసాలపై పోలీసుల ఆధ్వర్యంలో 786 అవగాహన సదస్సులు (ప్రజా చైతన్య కార్యక్రమాలు) నిర్వహిస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త అవతారం ఎత్తుతూ ప్రజలను నిలువునా దోచేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ వాడకంలో అనవసర లింక్‌లను, టెలీగ్రామ్ లింక్‌లను నొక్కకుండా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు తెలుపుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి.
- సెల్‌ఫోన్‌కు వచ్చే లింకులను జాగ్రత్తగా గమనించి, తెరవాలి.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తక్కువ ఉండేలా చూసుకోవాలి.
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు అసలు తెరవద్దు. లాటరీ ఆఫర్లు అంటూ వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మొద్దు.
- గుర్తుతెలియని వ్యక్తులకు ఖాతా వివరాలు, ఆధార్, ఓటీపీ వంటి సమాచారాన్ని ఇవ్వొద్దు.
- గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ల కోసం అస్సలు వెతకొద్దు.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తాం అనే వారి మాటలు, ప్రకటనలను విశ్వసించవద్దు.
- గుర్తు తెలియని ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దు, ఫేస్‌బుక్, వాట్సాప్ నుంచి వచ్చే వీడియో కాల్‌లకు స్పందించవద్దు.
- మీ ప్రమేయం లేకుండానే మీ ఫోన్‌లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా చూసుకోవాలి, ఫోన్ వాడకుండా చార్జింగ్ తగ్గిపోతుంటే అనుమానించాల్సిందే
- నా వాట్సాప్ బ్లాక్ అయ్యింది. మీ నెంబర్‌కు ఓటీపీ పంపాను. అది పంపిస్తే అన్‌లాక్ చేసుకుంటాను అని ఎవరైనా అడిగితే పొరపాటున కూడా ఓటీపీలు పంపవద్దు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, ఎస్పీ



సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే లింకులు, థర్డ్‌పార్టీ అప్లికేషన్లు అసలు తెరవద్దు. లాటరీ ఆఫర్లు అంటూ వచ్చే సందేశాలను నమ్మొద్దు. సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా 786 అవగాహన సదస్సులు నిర్వహించాం. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇచ్చి, ఫిర్యాదు చేయాలి.

పండగ పూట విషాదం



అనూష (ఫైల్)



చైత్ర (ఫైల్)

రాయగిరి కారు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతితో మిన్నంటిన రోదనలు

కేసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సెలవులకు సొంత ఊరు వచ్చి.. తమవారితో ఆనందంగా గడిపి.. తిరుగు ప్రయాణంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లీకూతురు మృతిచెందడం ఆ ఇంట తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కేసముద్రం మండలం గాంధీపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంకట్రాంతండాకు చెందిన భూక్య సంతోష్‌కు ఇదే మండలం కేసముద్రం స్టేషన్ పరిధిలోని లచ్చీరాంనాయక్‌తండాకు చెందిన అనూష (30)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కూతుళ్లు ప్రణశ్విని, చైత్ర (8) ఉన్నారు. ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం సంతోష్ కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లారు. అనూష గృహిణి కాగా, సంతోష్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబంతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు గాను వారు తమ సొంతకారులో స్వగ్రామమైన వెంకట్రాతండాకు మూడురోజుల క్రితం వచ్చారు. అనంతరం గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తన భార్య, కూతుళ్లతో పాటు తెల్లబండతండాకు చెందిన తన సోదరి గుగులోత్ భవాని, బావ గుగులోత్ రవి, ఏడాది వయస్సున్న మేనకోడలు మొత్తం ఏడుగురు కారులో హైదరాబాద్‌కు బయలు దేరారు. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో ముందు వెళుతున్న లారీని సంతోష్ కారు వేగంగా ఢీకొట్టగా.. లారీ వెనుక కిందిభాగంలోకి కారు దూసుకుపోయింది. దాంతో కారు ముందు సీట్లో కూర్చున్న అనూష, చిన్న కూతురు చైత్ర అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న సంతోష్, ఆయన సోదరి భవానికి గాయాలవగా భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పండుగకు ఇంటికి వచ్చి.. మూడురోజుల పాటు ఎంతో ఆనందంగా గడిపి.. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ బయల్దేరి వెళ్లిన తమవారి కారు ప్రమాదానికి గురవడం, అనూష, చైత్ర మృత్యువాత పడటంతో వెంకట్రాంతండా, అనూష పుట్టినిల్లయిన లచ్చీరాం తండాల్లోని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సాయంత్రానికి మృతదేహాలకు పోస్టు మార్టం పూర్తవగా.. స్వస్థలం వెంకట్రాతండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు.



కల్యల వెంకట్రాంతండాలోని మృతుల ఇంటి వద్ద విషాదవదనంలో బంధువులు

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



జిల్లా ఆస్పత్రిలో 10 పడకల డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 10 పడకల డయాలసిస్ యూనిట్, నాన్ కమ్యూనికేబుల్ డీసీజ్ (ఎన్‌సీడీ) సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం మార్చురీకి నాలుగు ఫ్రీజర్ బాక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో పేదల ఆరోగ్యాలను గాలికి వదిలేశారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సర్కార్ ఆస్పత్రుల్లో కార్పొరేట్‌స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్స కోసం పదిపడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో జగదీశ్వర్, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, డాక్టర్ లాకావత్ వెంకట్, డాక్టర్ హరిప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మానుకోట మార్కెట్ వైస్ చైర్మన్ మదన్‌లోయా, బోనగిరి గోపిరత్నం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

మానుకోట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శంకుస్థాపనలు చేశారు. తొలుత మునిసిపల్ 6వ వార్డు పరిధిలోని బేతోలు గ్రామంలో రూ.9.99 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 30వ వార్డు పరిధిలోని గుండ్లకుంట కాలనీలో రూ.4.99 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 24వ వార్డు పరిధిలో రూ.10 లక్షలతో యాదవనగర్, ఇందిరాకాలనీ వద్ద సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వనిర్మాణ పనులకు, కమ్యూనిటీ హాల్‌లో రూ. 7లక్షలతో నిర్మించే మౌళిక వసతుల నిర్మాణాలకు, జయశంకర్ కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరాకాలనీ వద్ద ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు మురళీనాయక్ బహుమతులు అందించారు.

ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, విద్యుత్ డీఈ విజయ్, కౌన్సిలర్లు భూక్య సునీతారవి, డౌలాగర్ శంకర్, కోడి శ్రీను, అంబాల శివకుమార్, ఆరెంపులవిజయ, పద్మం ప్రవీణ్, ఖలీల్‌పాషా, నీరుటి సురేష్‌నాయుడు, సల్వాది దిలీప్, మాదరబోయిన యాకయ్య, ఇంద్రారెడ్డి, మిట్టకంటి రాంరెడ్డి, కోడి శ్రీను, దైద వెంకన్న పాల్గొన్నారు.

సర్వే షురూ

- ప్రభుత్వ పథకాలపై అధికారుల గ్రామాల బాట
- నాలుగు స్కీంల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- 288 గ్రామాలను 82 క్లస్టర్లుగా విభజన
- ఒక్కో క్లస్టర్‌లో ఒక్కో బృందం సర్వే
- తొలిరోజు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



చిన్నగూడూరులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతు భరోసా పథకం సర్వే గురువారం ప్రారంభమైంది. రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీపై కూడా అధికారులు సర్వే చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 288 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 82 వ్యవసాయ క్లస్టర్లుగా విభజించారు. మొదటిరోజు 82 గ్రామాల్లో ఈ సర్వే ప్రారంభమైంది. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ చిన్నగూడూరు, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల్లోని పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాల వర్తించేలా చూడాలని, దానికి సంబంధించిన ప్రణాళిక ప్రకారం.. ప్రత్యేక బృందాల సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని అన్నారు. ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేసిన వివరాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పరిశీలించారు.


20 నుంచి 24 వరకు గ్రామసభలు..

నెల్లికుదురు మండలంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సంక్షేమ పథకాల సర్వేను పరిశీలించారు. కాగా, వ్యవసాయానికి యోగ్యం కానీ, పనికిరాని భూములను వివిధ మండలాల్లోని బృందాలు పరిశీలించాయి. గుట్టలు, బోళ్లు, రాళ్లు, రప్పలు ఉన్న భూములతోపాటు లేఅవుట్ చేసిన భూములనూ ఈ సర్వే బృందాలు పరిశీలించాయి. ఈనెల 19వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో సర్వేలు పూర్తి చేస్తుండగా, 20 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తారు. మహబూబాబాద్‌తో పాటు మరిపెడ, డోర్నకల్, తొర్రూరు మునిసిపాలిటీల కమిషనర్ల ఆధ్వర్యంలో వార్డుసభలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తారు. 24న తుది నివేదికను సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

జిల్లాలో ఇలా..

మహబూబాబాద్ మండలంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్, ఏఈవో పున్నమి, నిర్మల పాల్గొన్నారు. మహబూబాబాద్, ఈదులపూసపల్లి, అమనగల్, కంబాలపల్లి, జంగిలిగొండ, మాధవాపురం, బోడగుట్టతండాల్లో ఈ సర్వేలు జరిగాయి. కురవి మండలం బలపాల, మొగిలిచర్ల, గుండ్రాతిమడుగుల్లో తహసీల్దార్ సునిల్ రెడ్డి, ఎంపీడీవో వీరబాబు సర్వేలో పాల్గొన్నారు. సీరోలు మండలంలోని చింతపల్లిలో ఆర్డీవో కృష్ణవేణి పాల్గొనగా, మన్నెగూడెం, తాళ్లసంకీస, సక్రాంనాయక్‌తండా, బీల్యానాయక్‌తండాల్లో సర్వేలో తహసీల్దార్ శారద, ఏవో చాయ పాల్గొన్నారు. చిన్నగూడూరు, గుండంరాజుపల్లిల్లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సర్వేను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ మహమూద్‌అలీ, ఏఈవో పవన్‌కల్యాణ్, ఆర్ఐ వెంకన్నతో పాటు దంతాలపల్లిలో ఆగపేట, గొల్లపల్లిలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పరిశీలించారు. ఎంపీడీవో వివేక్రాం, తహసీల్దార్ రాజేశ్వర్, ఏవో వాహిని, ఆర్ఐ నహీమొద్దీన్, డోర్నకల్‌లో ఆర్డీవో కృష్ణవేణి, డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి అమ్మపాలెం, బంజరల్లో, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి మురళీమోహన్‌లు పర్యటించారు.

గార్ల మండలం పోచారం, కోక్యతండాల్లో జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్



కురవి మండలం బలపాలలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

మిగతా 8వ పేజీలో...

21 నుంచి పోలీస్‌శాఖ క్రీడోత్సవాలు

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద సిద్ధం చేసిన క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఈనెల 21వ తేదీ నుంచి 23 వరకు జిల్లా పోలీస్‌శాఖ క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ తెలిపారు. మహబూబాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రీడామైదానాన్ని గురువారం సాయంత్రం ఆయన పరిశీలించి, మాట్లాడారు. పోలీస్‌శాఖ క్రీడోత్సవాలు నిర్వహించడం ద్వారా జిల్లా పోలీస్ యంత్రాంగంలో నూతన ఉత్తేజం, ఉత్సాహం రెట్టింపవుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ వ్యాపారాల నివారణ, అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిరంతరం ప్రజాదర్బార్ నిర్వహిస్తూ ప్రజాసమస్యలపై స్పందిస్తున్న అధికారులకు ఈ క్రీడాపోటీలు ఎంతగానో ఉల్లాసానిస్తాయన్నారు. ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలింగ్‌త్రో తదితర క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

భార్యను చంపి ఇంటి ఆవరణలో పాతి..



నాగమణి మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న సీఐ పెండ్యాల దేవేందర్

- తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో భర్త పరారీ
- మహబూబాబాద్‌లో వివాహిత దారుణ హత్య !

6



గూడ్స్ రవాణాలో గేమ్‌చేంజర్!

7

కూచిపూడి నృత్యంలో బంగారు పతకం



కోలిండియా పోటీల్లో కూచిపూడి నృత్యం చేస్తున్న శ్రీనివాస్

కాకతీయఖని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో జరిగిన కోలిండియా స్థాయి సాంస్కృతిక పోటీల్లో సింగరేణి భూపాలపల్లి ఏరియాకు చెందిన అడిచర్ల శ్రీనివాస్ కూచిపూడి నృత్యంలో ప్రతిభను చాటాడు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ మేరకు ఏరియా అధికార ప్రతినిధి కూపూరి మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జానపద గ్రూప్ డ్యాన్స్‌లో ఏరియా కళాకారులు శ్రీనివాస్, కేశవులు, సురేష్, రవి, రాజ్‌కుమార్, నరేష్, విజయ్‌కుమార్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారని వివరించారు. వీరికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఎస్‌వో టు జీఎం కవీంద్ర అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

హేమాచల క్షేత్రానికి చేరిన ఉద్యమకారుడి సైకిల్ యాత్ర



హేమాచల క్షేత్రం వద్ద ఉద్యమకారుడు శ్రీనివాస్ పటేల్

మంగపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ అయ్యప్ప మాలధారణలో సైకిల్ యాత్ర చేపట్టిన కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం చింతకుంట వాసి కుడిది శ్రీనివాస్ పటేల్ ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రానికి గురువారం చేరుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుడైన శ్రీనివాస్ ఈనెల 4న తన సైకిల్ యాత్రను ప్రారంభించారు. హేమాచల క్షేత్రంలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కాంక్షిస్తూ పుణ్యక్షేత్రాలను సైకిల్ యాత్ర ద్వారా దర్శించుకుంటున్నానని ఆయన తెలిపారు. 41 రోజులు 41 దేవాలయాలను సందర్శించుకోవాలని సంకల్పించానని అన్నారు. ఇప్పటి వరకు 23 దేవాలయాలను దర్శించుకున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు.

మినీ జాతర ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర



మేడారంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

మేడారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. మేడారంలో ఆయన గురువారం పర్యటించారు. భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, దర్శనాల సౌకర్యాలు, జంపన్నవాగు పుణ్య స్నానాల ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, కల్యాణ కట్టలు, మరుగుదొడ్లు, రోడ్లు తిరుగుతూ పరిశీలించారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు సమ్మక్క-సారలమ్మల మినీ జాతర జరుగనున్న నేపథ్యంలో తరలివస్తున్న భక్తులకు త్వరితగతిన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మినీ జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసిందన్నారు. ముఖ్యంగా భక్తులకు పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ, వీవీఐపీ, ప్రొటోకాల్ దర్శన సౌకర్యాలు మెరుగ్గా ఉండాలన్నారు. దర్శనాల సమయంలో భక్తులకు తోపులాటలు జరగకుండా రద్దీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాకుండా వైద్య సేవలను మెరుగ్గా అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజ్, ఎంపీడీవో సుమనావాణి, పంచాయతీ కార్యదర్శి సతీష్, రెవెన్యూ, దేవాదాయ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

భార్యను చంపి ఇంటి ఆవరణలో పాతి..

- తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో భర్త పరారీ
- మహబూబాబాద్‌లో వివాహిత దారుణ హత్య!



మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సిగ్నల్ కాలనీలో ఘటనా స్థలం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



ఘటనా స్థలం వద్ద గుమికూడిన స్థానికులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను చంపి మృతదేహాన్ని తమ ఇంటి ఆవరణలోనే పాతిపెట్టి, దానిపై పేడతో కల్లాపు చల్లి.. తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో కలిసి భర్త పరారైన దారుణ ఘటన మహబూబాబాద్‌లో గురువారం వెలుగు చూసింది. మహబూబాబాద్ సిగ్నల్ కాలనీలో జరిగిన ఈ ఘటనలో తాటి నాగమణి(35) అనే వివాహిత శవమై కనిపించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చిత్తు కాగితాలు ఏరుకుంటూ, వేమ వాటర్ విక్రయిస్తూ జీవనం సాగించే తాటి గోపీ.. తన భార్య నాగమణి(35), తల్లిదండ్రులు లక్ష్మీ, రాములు, సోదరి దంపతులు రావూరి దుర్గ, మహేందర్‌తో కలిసి సిగ్నల్ కాలనీలో ఓ ఇంట్లో రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. దుర్గ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ గోపీ కుటుంబం 13వ తేదీ నుంచి అర్థాంతరంగా కనిపించకుండా పోయింది. ఇంటికి తాళం వేసి ఉండడం, ఆవరణలో గుంత తవ్వి ఏదో పూడ్చినట్టు ఉండి దుర్వాసన వస్తుండడాన్ని స్థానికులు గమనించారు. అయితే, మా అత్తను చంపి బొందా పెట్టారని.. దుర్గ చిన్న కుమార్తె మానస జనవరి 6న కాలనీలో పలువురి దగ్గర మాట్లాడగా, ఇదేమని దుర్గను ప్రశ్నించగా ఆ మాట దాటవేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో హత్య జరిగిందనే అనుమానంతో ఉన్న కాలనీవాసులు బుధవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఒడిసాలో ఉన్న ఇంటి యజమానిని రప్పించిన పోలీసులు.. ఇంటి ఆవరణలో అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతంలో గురువారం ఉదయం తవ్వించగా నాగమణి మృతదేహం బయటపడింది. అనంతరం ఇంటి తాళం పగలుగొట్టి లోపల చూడగా.. రావూరి దుర్గ ఆధార్ కార్డు మాత్రమే లభ్యమైంది. దుర్గ చిరునామా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం అని ఆ కార్డులో ఉంది. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, పరారీలో ఉన్న గోపీ, అతని కుటుంబం దొరికితేనే నాగమణి హత్యకు కారణం తెలియనుంది.

బ్యాంకు వద్ద రైతుల నిరసన

కాటారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పంట రుణాల కోసం వచ్చిన తమపై బ్యాంకు అధికారి దురుసుగా ప్రవర్తించాడని రైతులు నిరసన తెలిపారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఎస్‌బీఐ వద్ద గురువారం ఆందోళనకు దిగారు. గట్ల కుంటకు చెందిన రాజునాయక్ తమ కుటుంబ సభ్యులు, బంధువులతో పంట రుణాల కోసం ఫైళ్లను తీసుకుని బ్యాంకుకు వెళ్లగా ఫీల్డ్ ఆఫీసర్ దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. తనను ఆయన 'నువ్వెవరు.. ఎందుకు వచ్చావ్.. బయటకు వెళ్లు' అని మండిపడ్డాడని రాజునాయక్ తెలిపారు. గతంలో తమపై కూడా ఈ ఫీల్డ్ ఆఫీసర్ ఇదే విధంగా ప్రవర్తించాడని, కేసు పెడతానంటూ బెదిరించాడని తెలంగాణ జేఏసీ చైర్మన్ బొమ్మ సమ్మిరెడ్డితోపాటు పలువురు ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు ఇలా దురుసుగా ప్రవర్తించడం సరికాదని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల సందీప్ అన్నారు. దీనిపై ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ రుణాల కోసం వచ్చే వారితో మరికొందరు రానవసరం లేదని చెప్పానే తప్ప దురుసుగా మాట్లాడలేదని స్పష్టం చేశారు.

రోగికి వైద్యం అందకపోవడంపై డీఎంహెచ్‌వో విచారణ



పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

దంతాలపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ రోగికి నర్సింగ్ ఆఫీసర్ వైద్యం చేయకపోవడం పట్ల గురువారం జిల్లా వైద్యాధికారి మురళీధర్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ బుధవారం పీహెచ్‌సీలో చోటుచేసుకున్న ఘటనపై విచారణకు ఆదేశించారు. మురళీధర్ ప్రత్యేక బృందంతో కలిసి వైద్య సిబ్బంది పనితీరుపై విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. వైద్య సిబ్బందితో సమావేశమై జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికివచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడారం నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తొర్రూరు మండలానికి చెందిన భక్తులకు గాయాలు

ములుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారం అమ్మవార్ల దర్శనం చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 12మంది భక్తులకు స్వల్ప గాయాలైన సంఘటన గురువారం రాత్రి వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్ క్రాస్ వద్ద జరిగింది. వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన 15మంది ఓ ట్రాలీ వాహనంలో గురువారం మేడారం అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకున్న అనంతరం వారు స్వగ్రామానికి తిరుగుప్రయాణం కాగా.. వారి వాహనం వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్ క్రాస్ వద్దకు చేరుకున్న క్రమంలో వెనుకనుంచి వచ్చిన మరో ట్రాలీ వాహనం ఢీకొట్టింది. దీంతో ట్రాలీలో ప్రయాణిస్తున్న వారిలో పెరుమాండ్ల విజయ, వెంకన్న, శ్రీనివాస్, పులి ప్రవీణ్, మురళి, శ్రీలేఖ, శ్రీ, వినయ, ఉప్పలయ్య, బి.లావణ్య, రజిత, పి.స్రవంతి గాయాలయ్యాయి. వారిని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం స్వగ్రామానికి పంపారు. ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

వెంకటాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పేడుగొల్లగూడెం గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో దుర్గాప్రసాద్ ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి డ్రైవింగ్ సీటు నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయన ఎడమకాలు పైనుంచి వెనుకచక్రం వెళ్లడంతో కాలు పూర్తిగా దెబ్బతింది. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం తరలించారు.

ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలి

వెంకటాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు కోసం ఆదివాసీలు ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం సాయి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతోపాటు తెలంగాణ ఆదివాసీ యువతకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ యువతకు ఆదివాసీ చట్టాలపై అవగాహన అవసరమని అన్నారు. ఏజెన్సీలో ఆది వాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కారం ఆనంద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం మూడుకొట్ల సెంటర్‌లో గురువారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మూడుకొట్ల సెంటర్‌కు చెందిన పాము వెంకటనారాయణ(70) దుస్తుల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో పాటు చిన్నకుమారుడు కిరణ్‌కుమార్ మానసిక వికలాంగుడు కావడంతో మనోవేదనకు గురైన ఆయన గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటివారు చిన్నకుమారుడు మీనాన్న ఇంకా లేవలేదా? అని ప్రశ్నించగా అతను ఏమి చెప్పలేకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికిలో నుంచి చూశారు. అప్పటికేఫ్యానుకు ఉరివేసుకుని వెంకటనారయణ మృతి చెంది కన్పించడంతో పెద్దకుమారుడు శ్రావణ్‌కుమార్ సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్‌కుమార్ ఇంటికి చేరుకున్నారు. శ్రావణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ వార్షిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లా 12వ స్థానంలో ఉందని, రాబోయే పరీక్షల ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా దృషి సారించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. విద్యారంగం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందన్నారు. ఉద్యోగనియామకాలు చేపడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, సమ్మెట వెంకటేశ్వర్లు, మందుల శ్రీరాములు, వాంకుడోతు బాలాజి, వెంకటేశ్వరరావు, రవికుమార్, యాదగిరి, రాందాస్, ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఫారుక్, వహీద్, పూజారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం అడ్డుపడిన ద్రోహులను తరిమికొట్టిన ఘనత ఉద్యమకారులదేనని, గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించారని, సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు మల్లయ్య, నర్సింహారెడ్డి, వెంకన్న, సుధాకర్, నాగరాజు, హుస్సేన్, బుచ్చిరాములు, దేవేందర్, సంపత్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మునిసిపల్ పాలకవర్గ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ రాంచంద్రయ్య

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాలకవర్గ సమావేశం గురువారం చైర్మన్ రాంచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. మునిసిపాలిటీలో గత సమావేశంలో జరిగిన అంశాలు, ఐదేళ్లుగా మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో తొర్రూరు మునిసిపాలిటీని ఆశించినంత మేర అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరీ, అభివృద్ధి పనులు కొనసాగాయని, మునిసిపాలిటీలో మోడల్ మార్కెట్, చిల్డ్రన్స్ పార్కు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, మెయిన్ రోడ్డులో డ్రైనేజీ లాంటి పనులు పూర్తి చేశామన్నారు. మరో 30 శాతం పనులు పూర్తి చేస్తే తమ హయాంలో అన్ని పనులు అభివృద్ధి చేసినట్లు అవుతుందని, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సాకారంతో రూ.10కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. పాలకవర్గం ముందు పెట్టిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు శ్రీనివాస రావు, రాము, రోజా, సునీత జైసింగ్, దొంగరి రేవతిశంకర్, గజానంద్, అలివేలు, నాగజ్యోతి, శంకర్, మాధవిఅనిల్, కో-ఆప్షన్‌లు, కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ కట్ట స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలుకు అనుకూలంగా ప్రకటన చేయాలని మాదిగ కళాకారుల రాష్ట్ర కో-ఆర్డినేటర్ యాసారపు సాయిలు, ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు సోమారపు ఐలయ్య అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ ఏ బీ సీ డీ వర్గీకరణ అమలు పర్చాలనే లక్ష్యంతో మాదిగల అస్థిత్వ పోరాటం చేపడుతున్నామని, సామాజిక న్యాయ పోరాటం కోసం జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమంలో మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నేడు తొర్రూరు డివిజన్ కేంద్రంలో మాదిగ ఉప కులాల ఆధ్వర్యంలో డప్పు కళాకారులచే అంబేద్కర్ విగ్రహం నుంచి జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందని, ఈ ర్యాలీకి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మహంకాళి బుచ్చయ్య, మంగళపల్లి రాంచంద్రయ్య, బాబు, అంజయ్య, శ్రీనివాస్, మంగళపల్లి శ్రీను, సురేందర్, భిక్షపతి, రంజిత్, యాకయ్య, రమేష్, పూర్ణచందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంతూళ్ల నుంచి తిరుగుముఖం

- సంక్రాంతి పండుగకు వచ్చి వెళ్తున్న జనం
- ఖాళీ అవుతున్న పల్లెలు, పట్టణాల్లో పెరుగుతున్న రద్దీ



మానుకోట బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు వచ్చిన జనం తిరుగుముఖం పట్టారు. రైతులకు పంట చేతికందడంతో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం పల్లెల్లో సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు పల్లెలకు చేరుకోవడంతో పండుగ శోభను సంతరించుకున్నాయి. పండుగ రోజుల్లో మహిళలకు ముగ్గులు, యువతకు గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించడంతో పల్లెలన్నీ సందడిగా మారి ఎక్కడ చూసినా జనసందోహం కన్పించింది. సంక్రాంతి పండుగ ముగియడంతో గురువారం సొంతూళ్ల నుంచి బయలు దేరి తిరిగి వారివారి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. పండుగను పురస్కరించుకుని ఈనెల 11 నుంచి 17 వరకు విద్యాసంస్థలకు రాష్ట్ర సర్కార్ సెలవులు ప్రకటించగా, ఉద్యోగులకు ప్రతీ ఏటా సంక్రాంతి పండుగకు వచ్చే మూడు రోజులతో పాటు జనవరి 11న రెండవ శనివారం, 12న ఆదివారం కావడంతో ఏకంగా పండుగ సెలవులు ఐదు రోజులు వచ్చాయి. ఈక్రమంలో పండుగకు ముందస్తుగానే తమ పిల్లాపాపలతో ఈ నెల 11న పట్టణాల నుంచి సొంతూళ్లకు చేరుకున్నారు. ఐదు రోజుల పాటు పల్లెల్లో పండుగ సంబురాలు జరుపుకుని 15న సాయంత్రం నుంచే తిరుగు ప్రయాణమయ్యారు. 16న పెద్ద మొత్తంలో గ్రామాల నుంచి పట్టణాలకు బయలుదేరడంతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిటకిట లాడాయి. పండుగకు వచ్చిన బంధువులు తరలిపోవడంతో పల్లెలన్నీ ఖాళీగా బోసిపోయి కన్పించాయి. ఐదు రోజుల పాటు రద్దీ తక్కువగా ఉన్న పట్టణాలకు జనం చేరుకోవడంతో గురువారం నుంచి మళ్లీ వాహనాల తాకిడి పెరిగిపోయింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6250	5600
పల్లికాయ (పచ్చిది)	4950	4100
కందులు	7033	5560
పెసళ్లు	-	-
పత్తి	7210	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14800	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	13000	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	15000	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



ఐనవోలు ఆలయం ప్రాంగణంలో ప్రోక్షణ చేస్తున్న అర్చకులు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావులు

మల్లన్న స్వామికి ఘనంగా సంప్రోక్షణ

పట్టువస్త్రాలు సమర్పించిన కూనూరు వాసులు

ఐనవోలు, జనవరి16 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులతో పూజలందుకున్న స్వామి వారికి గురువారం వైభవంగా మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించారు. పుణ్యాహవాచనములో భాగంగా వేదపండితులు, అర్చకులు స్వచ్ఛమైన జలము సుగంధ ద్రవ్యాలు నవధాన్యాలు కలుషంలో మిలితం చేసి మంత్ర పఠనం చేస్తూ స్వామి వారిని అవాహన చేశారు. తదుపరి ఆలయంతోపాటు ప్రాంగణములో వేద మంత్రోత్సరణలతో ప్రోక్షణ (చల్లడం) జరిపారు. మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకములు చేసి శివలింగాన్ని స్వామి వారి ప్రతిబింబముతో అలంకరించి అన్నపూజ నిర్వహించి మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు బ్రాహ్మణులకు పండిత సన్మానాలూ సమారాధన జరిపారు. సంప్రోక్షణ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, అర్చకులు భానుప్రసాద్, ఉప్పల శ్రీనివాస్, అర్చక సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

కునూరు వాసుల పట్టువస్త్రాలు

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కునూరు గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామికి పట్టువస్త్రాలు బహూకరించారు. జాతరలో లక్షలాది మంది భక్తులచే పూజలు అందుకున్న స్వామి వారికి మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించాక స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేయడం అనవాయితీగా కొనసాగుతోంది. ఈ పట్టు వస్త్రాలను కునూరు ఉమామహేశ్వరం(శివాలయం) దేవాలయం, గ్రామ పంచాయతీలు ఆరేళ్లుగా అందజేస్తున్నాయి. మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడమ్మ, భ్రమరాంబదేవిక గణపతి అంజనేయస్వామిలకు పట్టువస్త్రాలను సమర్పించాక స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకుడు సదాశివశర్మ, బ్రహ్మణపల్లి మధుశర్మ గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామికి కోడె మొక్కులు చెల్లిస్తున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్

కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

భీమదేవరపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి సన్నిధికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఆలయ ఈవో కిషన్‌రావుల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి గుమ్మడికాయ, కోడె మొక్కులను చెల్లించారు.

ఆసక్తే ఆవిష్కరణలకు ప్రేరణ

పదికిపైగా పరికరాలను రూపొందించిన యువశాస్త్రవేత్త సంతోష్ కుమార్

వాటిలో సైన్యానికి ఉపయోగపడేవే ఎక్కువ

యువ



తాను రూపొందించిన వాయిస్ టెలిస్కోప్‌తో యువ శాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్

హనుమకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సరికొత్త సాంకేతిక పరికరాలను రూపొందించాలంటే ఆసక్తి, పరిశోధనలపై అనురక్తి.. శాస్త్ర, సాంకేతిక ఫలాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న తపన ఉండాలి. ఇందుకు నిశిత దృష్టి, లోతైన అధ్యయనమూ ఎంతో అవసరం. ఇవన్నీ పుష్కలంగా ఉన్న యువశాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్.. అతి తక్కువ కాలంలోనే పదికిపైగా సరికొత్త పరికరాలకు రూపకల్పన చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటకు చెందిన సంతోష్‌కుమార్ ప్రస్తుతం నర్సంపేటలోని బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన ఆయన వరంగల్ పాలిటెక్నిక్ కంప్యూటర్ సైన్స్‌లో డిప్లమా చేసిన తర్వాత విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బీటెక్, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఎంటెక్, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బాల్యం నుంచి కొత్త వస్తువులు తయారు చేయడమంటే ఎంతో ఆసక్తి ఉన్న ఆయన పాఠశాల స్థాయిలో చాలా సైన్స్ ఎగ్జిబిట్లు చేసి ప్రదర్శనకు పెట్టి.. ఎన్నో ప్రైజ్‌లు కూడా దక్కించుకున్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై మరింత దృష్టి పెట్టారు.

విదేశాల్లో పరిశోధనలు.. దక్కిన అవార్డులు..

తక్కువ ఖర్చుతో తయారు చేసిన పీసీకి మంచి స్పందన వచ్చిందని, దీనిపైనే విదేశాల్లో పరిశోధనలు చేయడానికి అవకాశం లభించిందని, ఆఫ్రికాలో ఈ ప్రాజెక్టును అమలు చేయమని పిలుపు వచ్చిందని సంతోష్ కుమార్ వివరించారు. జర్మనీ, ఆఫ్రికా దేశాల్లో ఈ ప్రాజెక్టుపై పనిచేశానని, అక్కడ ఇళ్లపై అనుమానాస్పద స్థితిలో ఎగిరే డ్రోన్లను గుర్తించే ఆటోమెటిక్ డిఫెన్స్ డిటెక్టివ్ సిస్టమ్ రూపొందించానన్నారు. ఇథియోపియా యూనివర్సిటీలో రెండేళ్ల పాటు వివిధ పరిశోధనలు చేశానన్నారు. అయితే డాక్టర్ సంతోష్ పరిశోధనలకు గాను 2018లో మైసూర్ యూనివర్సిటీ యంగ్ సైంటిస్టు అవార్డును ప్రదానం చేసింది. మానవ రహిత చోదక వాహనం తయారీకి న్యూఢిల్లీ బీడీఎస్ఏ అంబేద్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డు అందించింది. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా నర్సంపేట పట్టణంలోనే ఉంటున్న డాక్టర్ సంతోష్ కుమార్ తండ్రి శీలం సత్యనారాయణ తండ్రి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. తల్లి సరస్వతి. డాక్టర్ సంతోష్‌కు భార్య శివరాణి, ఇద్దరు కుమారులున్నారు. ఒక పక్క కాలేజీలో విద్యాబోధన సాగిస్తూనే మరో పక్క పరిశోధనలను మరింతగా కొనసాగిస్తానంటున్నారు. తన ఆలోచనల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు ఉన్నాయనీ, వాటికి భవిష్యత్తులో ఒక రూపాన్ని ఇస్తానని డాక్టర్ సంతోష్ అంటున్నారు.

అటానమస్ రోబో

సైనికులకు ఎంతో ఉపయోగంగా ఉండే ఒక రోబోకు కూడా రూపకల్పన చేశారు సంతోష్‌కుమార్. ఈ రోబో సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, శత్రువుల సమాచారం నమోదు చేయడం, వారిని కట్టడి చేయడం, గాయపడిన సైనికులను గుర్తించి యుద్ధం నుంచి సురక్షిత ప్రాంతానికి చేరవేయడానికి ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాన్ని నడపడం లాంటి పనులు ఈ రోబో చేస్తుందని ఆయన వివరించారు. మొదటి దశ ప్రయోగం పూర్తయిందని, ప్రస్తుతం 50శాతం పనులు ఈ రోబో చేయగలుగుతోందని, దీనిని తయారు చేయడానికి ఇప్పటి వరకు రూ.50లక్షలు ఖర్చయిందని తెలిపారు.

సోలార్ పీసీ..

తాను రూపొందించిన పరికరాల్లో సోలార్ కంప్యూటర్‌కు కేవలం మానిటర్ ఉంటుందని, 12 వోల్టుల సోలార్ ప్యానెల్ జతచేయడం ద్వారా అడవిలో కూడా పనిచేస్తుందన్నారు. దీని తయారీ వ్యయం రూ.15వేలని, పేద విద్యార్థుల కోసం అన్ని ప్రోగ్రామింగ్ లాంగ్వేజులు, ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌లు అన్ని ఇందులో పొందుపరిచానని, 38 ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఇందులో రన్ అవుతాయని, బ్లూటూత్, వైఫై ఇన్‌బిల్ట్‌గా ఉంటాయని, మానిటర్, మౌజ్, కీబోర్డు మాత్రమే బయట ఉంటాయన్నారు. ఒక సారి రీచార్జ్ చేస్తే కరెంట్ లేకుండా కూడా చాలా సేపు వాడుకోవచ్చని, ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ ధర రూ. 25వేల నుంచి రూ 30వేలు ఉందని, ఒక కంప్యూటర్ కొనాలంటే రూ.50వేలకు పైనే అవుతుందని, పేద విద్యార్థుల కోసం తక్కువ ఖర్చుతో దీనిని తయారు చేశానన్నారు.

డ్రైవర్ రహిత వాహనం



సంతోష్ రూపొందించిన మానవ రహిత వాహనం

సంతోష్ ఆవిష్కరణల్లో ముఖ్యమైంది డ్రైవర్ రహిత వాహనం. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే వాహనాన్నే ప్రయోగానికి వినియోగించి.. కృత్రిమ మేధతో ఒక సిస్టమ్‌ను ఈ వాహనంలో ఉపయోగించి డ్రైవర్ లేకుండానే నిర్దేశిత మార్గంలో సునాయాసంగా ప్రయాణించేలా రూపకల్పన చేశారు. మనిషి ప్రమేయం లేకుండా అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగే ఈ వాహనం సైనికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సైనికులు సరిహద్దుల్లో కాపాలాలో భాగంగా ఒక చోటి నుంచి మరో చోటికి వేళ్లేప్పుడు బరువైన సామగ్రి, ఆయుధాలను మోసుకెళుతుంటారు. ఆ సమస్యను అధిగమించడానికి ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుంది. 2489 సీసీ ఇంజన్ గల ఈ వాహనం గేర్, క్లచ్, బ్రేక్‌లను తనకుతానే నియంత్రించుకుంటూ ఎప్పటికప్పుడు దిశను మార్చుకుంటూ ముందున్న వాహనాన్ని అనుసరించేలా డీప్‌లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వాడుకొని ఈ వాహనాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఈ వాహనం రూపకల్పన చివరి దశలో ఉండగా.. దీనిపై ఇప్పటి వరకు రూ.18లక్షల వరకు ఖర్చవగా.. అదంతా బాలాజీ ఇన్ స్టిట్యూట్ యాజమాన్యమే భరించింది. అలాగే ఈ మానవ రహిత వాహనంపై గుంటూరులోని నాగా ర్జున విశ్వవిద్యాలయం, మధ్యప్రదేశ్‌లోని మంగల్యా తన్ యూనివర్సిటీలో పరిశోధన జరుగుతోందని, వాటిని తానే కోఆర్డినేట్ చేస్తున్నానని సంతోష్ తెలిపారు. ఈ వాహనం తయారీపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని, దీనిని మరింత ఆధునికీకరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వాయిస్ టెలిస్కోప్..

దూరంగా ఉండే వస్తువులను చూసేది సాధారణ టెలిస్కోప్. దీనికి భిన్నమైనదే వాయిస్ టెలిస్కోప్. అరకిలో మీటరు దూరంలో ఉన్న వ్యక్తులను చూడడమే కాదు.. వారు ఏం మాట్లాడుకుంటున్నది కూడా వినవచ్చు. ఇది కూడా సైనికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, 2017-18లో రూపొందించిన ఈ పరికరాన్ని వరంగల్ నిట్ ప్రొఫెసర్లు కూడా చూసి ప్రశంసించారని, ఒక అంతర్జాతీయ సదస్సులో ఈ పరికరంపై ప్రజంటేషన్ ఇచ్చినప్పుడు మంచి స్పందన వచ్చిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించిన ఈ పరికరానికి పేటెంట్ లభించిందని, ఈ వాయిస్ టెలిస్కోప్‌ను మరింత ఆధునికీకరించేందుకు కృషి జరుగుతోందని, ఈ పరికరం తయారీకి రూ.4లక్షలు ఖర్చయిందని, ఈ పరికరాన్ని బల్క్‌గా ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ కింద రూ.3.50లక్షల నిధులను ఇచ్చిందన్నారు.

దృశ్యాదృశ్యీకరణ ప్రయోగం

దృశ్యాదృశ్యీకరణ.. మన వేదాల్లో యంత్రసర్వస్వం గ్రంథం ఉందని, భరద్వాజ మహర్షి సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం ఇంగ్లీష్‌లో అనువాదమైందని, దానిని చదివినప్పుడు దృశ్యాదృశ్యీకరణ తనను బాగా ఆకర్షించిందన్నారు. కొన్ని చెట్ల ఆకుల రసాన్ని తీసి దానికి కొన్ని రకాల రసాయనాలను జోడించి ఒక ఇమేజ్‌పై పోసినప్పుడు అది తెల్లగా మారి అదృశ్యమైపోతుందని, దీనిని చూడాలంటే ప్రత్యేక పరికరం కావాలని, ఆ పరికరాన్ని తాను తయారు చేశానని, దీన్నే వేదాల్లో దృశ్యాదృశ్యీకరణ (ఇన్‌విజుబులిటీ) ప్రక్రియగా పేర్కొంటారన్నారు. కొన్ని అంతర్జాతీయ సదస్సుల్లో ఈ ప్రయోగంపై డెమో ఇచ్చినప్పుడు ప్రశంసలు వచ్చాయని దీనిపై ఇంకా లోతుగా పరిశోధన చేయాల్సి ఉందన్నారు.

ప్రస్తుతం గూడ్స్ రైళ్లకు వినియోగిస్తున్న డబ్ల్యూఏజీ-09 ఎలక్ట్రిక్ లోకో మోటివ్



- సరుకు తరలింపులో కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 లోకో మోటివ్‌లు
- కొత్త ఇంజన్ల రాకతో పెరగనున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం
- మేక్ ఇన్ ఇండియాలో భాగంగా బిహార్‌లో తయారీ చేపట్టిన రైల్వేశాఖ

గూడ్స్ రవాణాలో గేమ్‌చేంజర్!

డోర్నకల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మన భారతీయ రైల్వేశాఖ సరుకు రవాణాకు వినియోగిస్తున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపు కాగా, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగం 50 నుంచి 52 కిలోమీటర్లు లోపు మాత్రమే ఉంది. ఈ విషయాన్ని గతేడాది రైల్వే శాఖమంత్రి లోక్‌సభలో వెల్లడించారు. ఇకపై పరిస్థితి మారనుంది. సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందిన దేశాల్లోలా.. సరుకును మరింత వేగంగా గమ్యానికి చేర్చేలా అధునాతన డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌ల ను రైల్వేశాఖ రూపొందిస్తోంది. 12వేల హార్స్‌పవర్... గంటకు 120కిలోమీటర్ల వేగం.. 6వేల టన్నుల బరువును ఎత్తుమార్గంలో సైతం లాగేలా తయారు చేస్తున్న ఈ కొత్త ఇంజిన్లు గూడ్స్ రవాణా వ్యవస్థలో గేమ్‌చేంజర్‌గా నిలవనున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మన దేశంలో 1980వ దశకం వరకు రైళ్ల ద్వారానే అత్యధికంగా సరుకు రవాణా జరిగేది. సరళీకరణ, ఆర్థిక విధానాల ప్రవేశపెట్టిన తరువాత పెద్దఎత్తున జాతీయ రహదారుల నిర్మాణ విస్తరణ చేపట్టారు. దీంతో రోడ్డు రవాణా రంగం పుంజుకుంది. ప్రస్తుతం మన రైల్వేశాఖ సరుకుల రవాణాకు డబ్ల్యూఏజీ-9 లోకోమోటివ్‌లను వినియోగిస్తుండగా.. ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లోకి వేళ్లే సమయంలో ఇంజన్‌లు లోడును లాగలేక మొరాయిస్తున్న సంఘటనలున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్‌పెట్టేలా డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లను తయారు చేస్తోంది. ఇప్పటికే పారిశ్రామీకరణ రోజురోజుకు విస్తరించిన నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు, వాటితో తయారైన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలను, ఉత్పత్తులను పెద్దస్థాయిలో వేగంగా తక్కువ ఖర్చుతో తరలించడానికి గాను గూడ్స్‌రైళ్లను ఉపయోగిస్తున్నారు. దీంతో రైల్వేలో గూడ్స్ రైళ్ల రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. అందుకు అనుగుణంగా రైల్వేలైన్ల నిర్మాణం మాత్రం అశించిన మేర పెరగలేదు. 70 శాతం బ్రిటిష్ హయంలో నిర్మించిన మార్గాల మీదుగానే రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. భారతీయ రైల్వేలో ప్రస్తుతం 68 వేల కిలోమీటర్ల పొడవు గల ట్రాక్ ఉండగా.. ఇందులో స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ హయాంలో సుమారు 54 వేల కిలోమీటర్ల మేర రైల్వేలైను నిర్మించగా.. స్వాతంత్ర్యం అనంతరం కేవలం 14వేల కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని మాత్రమే నిర్మించారు. ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైళ్ల రాకపోకలతో రైల్వేట్రాక్‌లపై విపరీతమైన రద్దీ ఉంటుంది. ఉదాహరణకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగానే సగటున ప్రతీ 12 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది.

గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే..

రైల్వేశాఖలో గూడ్స్‌రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణం రైళ్ల రద్దీనే కాకుండా ప్రస్తుతం ఉన్న రైల్వేట్రాక్‌లపై ఏదో ఒకరోజు నిర్వహణ పనులు కొనసాగుతుండడం, చాలాచోట్ల వందేళ్ల క్రితం అప్పటి ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు, వంపు మార్గాలు అధికంగా ఉండడం, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు, నిర్వహణ సిబ్బంది కొరత, రైలు ఇంజన్ల సామర్థ్యం తదితర కారణాలనిని చెప్పవచ్చు. ప్రస్తుతం విపరీతమైన ఆలస్యంతో నడుస్తున్నా.. రైళ్లవల్ల సరుకు, ప్రయాణికుల చేరవేతలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని రైల్వే చేరుకోలేకపోతోంది. భారతీయ రైల్వేలో మౌళిక వసతుల కల్పన మరియు నూతన రైల్వేనిర్మాణం కోసం గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయిస్తున్నారు. అందులో భాగంగానే ఉత్తర, దక్షిణ భారతదేశాలను అనుసంధానిస్తున్న న్యూఢిల్లీ-చెన్నై (గ్రాండ్‌ట్రంక్) మార్గంలో మూడోరైల్వే ట్రాక్ నిర్మా ణాన్ని చేపట్టింది. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ట్రాక్ అందు బాటులోకి వస్తే సత్వరమే వేగంగా రైళ్లను.. ముఖ్యంగా గూడ్స్‌రైళ్ల వేగం పెంచేందుకూ కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే శక్తివంతమైన రైలు ఇంజన్‌లను దేశంలోనే తయారు చేస్తున్నారు.

ఇప్పటికే బొగ్గు తరలింపులో వినియోగం..

శక్తివంతమైన ఈ కొత్త లోకోమోటివ్‌లను రాష్ట్రంలో వినియోగిస్తున్నారు. ఇవి గతేడాది నవంబరులో పట్టాలెక్కాయి. డోర్నకల్-భద్రాచలంరోడ్, మణుగూరు, ఇల్లెందు మధ్య సింగరేణి బొగ్గును తరలించేందుకు డోర్నకల్ రైల్వేజంక్షన్ మీదుగా నడిచే గూడ్స్ రైళ్లకు ఈ అధునాతన బాహుబలి ఇంజన్లను రైల్వేశాఖ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం వీటి పనితీరు మెరుగ్గా ఉండటంతో భవిష్యత్‌లో వీటిని మరిన్ని రైళ్లకు వినియోగించేలా చర్యలు చేపడుతోంది.


కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 ఇంజన్..

రైల్వేలో డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లు.. రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఇంజన్‌లను బిహార్ రాష్ట్రంలోని మాదేపూరలో రైల్వేశాఖ వీటి తయారీని చేపట్టింది. అందులో భాగంగా డబ్ల్యూఏజీ-12 మరియు డబ్ల్యూఏజీ-12బి సిరీస్ ఇంజన్లను తయారు చేస్తోంది. 12 వేల హార్స్ పవర్ (అశ్వికశక్తి) గల ఈ లోకోమోటివ్‌లు 6 వేల టన్నుల అధిక లోడును ఎత్తుమార్గంలో సైతం లాగడమే కాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే విధంగా రూపకల్పన చేశారు. రైలు డ్రైవర్ (లోకోపైలెట్), సహాయ డ్రైవర్ (అసిస్టెంట్ లోకోపైలెట్)లకు సౌకర్యవంతంగా ఉండే విధంగా క్యాబిన్‌ను పూర్తిగా ఎయిర్ కండీషన్ చేశారు. ఇలాంటి శక్తివంతమైన ఎలక్ట్రిక్ రైళ్ల లోకో మోటివ్‌లను తయారు చేసిన ప్రపంచంలోని ఆరో దేశంగా మనదేశం నిలిచింది. అందులో భాగంగా దేశంలోని వివిధ రైల్వేజోన్‌లలో ఎత్తు పల్లాలు అధికంగా ఉన్నమార్గాల్లో ఈ బాహుబలి ఇంజన్లతో కూడిన గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. త్వరలో ఈ ఎలక్ట్రికల్ ఇంజన్లను భారీ ఎత్తున చేపట్టడానికి గాను మాదేపూర ప్లాంట్ విస్తరణను రైల్వే శాఖ చేపట్టింది.



రైల్వేలో నూతనంగా ప్రవేశపెట్టిన డబ్ల్యూఏజీ-12బీ లోకో మోటివ్

విద్యుద్దీపాల వెలుగులో దర్గా ఆవరణ



ప్రారంభమైన అన్నారం దర్గా ఉర్సు

అలరించిన ఖవ్వాలి గేయాలు

ఘనంగా సందల్ (గంధం) ఊరేగింపు

పర్వతగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్ గ్రామంలోని యాకూబ్‌షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముజావరు గౌస్‌పాషా ఇంటివద్ద హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులచే ఖవ్వాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు ఆలపించిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం అక్కడినుంచి సంధల్(గంధం) తీసుకుని బయలుదేరి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో జెండాలు, గంధంతో ముజావర్లు, మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్లు ఒళ్లు గగుర్పొడిచే రీతిలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం తెల్లవారుజామున దర్గాకు గంధం తీసుకువచ్చిన ముజావర్లు యాకూబ్‌బాబాకు సమర్పించారు. అనంతరం చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు

పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో బోర్డు ఇన్స్‌క్టర్ రియాజ్‌పాషా ఏర్పాట్లు చేపట్టారు. వక్ఫ్‌బోర్డు నుంచి ఉర్సు ఉత్సవాలకు రూ.8.50 లక్షలు మంజూరు కాగా, ఆ నిధులతో పారిశుధ్యం, తాగునీరు, భక్తుల విడిది, దర్గాతో పాటు చిల్లాలకు రంగులు, విద్యుద్దీపాలు, దర్గా ఆవరణలో అలంకరణ దీపాలు, రెండో రోజు భక్తులకు అన్నదానం తదితర ఏర్పాట్లు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, దర్గా పరిసరాలు, ప్రధాన రోడ్లపై పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో విడిది చేశారు.



దర్గా వద్ద ఉర్సు సందడి

నేడు అన్నదానం

ఉర్సు ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నదానం చేపట్టనున్నారు. గురువారం రాత్రి దర్గాకు గంధం చెల్లించడంతో శుక్రవారం రోజంతా భక్తులు దర్శనం చేసుకుంటారు. చివరి రోజైన శనివారం దీపారాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

● కార్మిక శాఖ అధికారి రమేష్

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమ మండలి కింద అమలవుతున్న సంక్షేమ పథకాల్లో భాగంగా కార్మికుల పిల్లలు, కార్మికులకు ఉపకార వేతనాలను అందించేందుకు వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కార్మిక శాఖ అధికారి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్యసంస్థలు, కర్మగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక లేదా ఇతర ట్రస్టుల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు వివిధ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను కోరుతున్నామని వివరించారు. దరఖాస్తు ఫారాలను సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో ఫిబ్రవరి 15 లోగా సమర్పించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న లేదా గడువు పూర్తయ్యాక సమర్పించబడిన దరఖాస్తులు తిరస్కరించ బడుతాయని తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ వారికి రూ.1000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజనీరింగ్ మెడిసన్, బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లమా ఇన్ మెడికల్ లెబోరేటరీ టెక్నిషియన్ కోర్సులు పూర్తి చేసిన వారికిసంవత్సరానికి రూ.2 వేల చొప్పున ఉపకార వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను వారి క్లాసు లేదా కోర్సుల్లో మార్కుల శాతం ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఉపకార వేతనాలను మేడే నాటికి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

'మహా సభలను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు జరుపతలపెట్టిన సీపీఎం రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మహాసభలో ప్రజా పోరాటాలు, సాధించిన విజయాలపై చర్చించి, సమస్యలపై భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు చెప్పారు. సభల తొలి రోజు ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, దీనికి ముఖ్యవక్తలుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బృందాకరత్, పొలిట్ బ్యూరో సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర నిర్మాణ బాధ్యుడు బీవీ, రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నారని తెలిపారు. సభకు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రంద చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, గునిగంటి రాజన్న, కుంట ఉపేందర్, పట్టణ కార్యదర్శి సీతారాంనాయక్ పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపే రంగవల్లులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వచ్చిందంటే చాలు.. మహిళలు దినపత్రికల్లో వచ్చే ముగ్గులు,లేదా మొబైల్ ఫోన్‌లో ఉండే కొత్తకొత్త రంగవల్లులు నేర్చుకుని పండుగ రోజున ఇంటి ముందు అందగా వేస్తారు. సాధారణంగా ముగ్గుల పోటీలంటే చుక్కల ముగ్గులను వేసి, వాటిని అందంగా తీర్చిదిద్ది బహుమతి గెలుచుకోవాలనే ఆలోచనతో మహిళలు ముగ్గులు వేస్తారు. ఇక్కడ మాత్రం అలా ఆలోచించకుండా సమాజాన్ని మేల్కొపే సందేశాత్మక ముగ్గులు వేసి, అందరిని ఆలోచింపజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహబూబాబాద్ మునిసిపల్ 24వ వార్డు ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాకాలనీ వద్ద గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. శివారు కాలనీలకు చెందిన మహిళలు. దాదాపు 80 మందికిపైగా పాల్గొన్న ఈ పోటీల్లో కొంతమంది యువతులు, మహిళలు సందేశాత్మక ముగ్గులను వేశారు. సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్నమూఢనమ్మకాలను నమ్మవద్దంటూ ముగ్గును వేసి అందులో కోడిగుడ్డు, మిర్చి, కుంకుమ, పసుపు, నిమ్మకాయను పెట్టారు. మరోపక్క మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించాలంటూ స్టాప్ రేప్.. స్టాప్ వాయిలెన్స్.. అంటూ ముగ్గులను వేశారు. అలాగే అఘాయిత్యానికి గురై చనిపోయిన మహిళ విషయంలో దుండగులను శిక్షించి, న్యాయం చేయాలని కోరుతూ ముగ్గును వేశారు. ఇలా సమాజాన్ని మేల్కొలిపే విధంగా సందేశాత్మకంగా ముగ్గులను వేసిఅందరిని ఆలోచింప జేశారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ స్వయంగా సందేశాత్మక ముగ్గులను పరిశీలించి సమాజాన్ని మేల్కొలిపే విధంగా ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు.



మానుకోటలో మూఢనమ్మకాలను పట్టించుకోవద్దంటూ వేసిన ముగ్గు



సందేశాత్మక ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ మోడల్ ఇల్లుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈనెల 26 నుంచి సంక్షేమ సంబరాలు నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివద్ధి పనులను ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు, ఎంపీవో పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, గొల్లపెల్లిప్రభాకర్, శ్రీపాల్‌రెడ్డి, బాలాజీనాయక్, జెల్ల వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రిటైర్మెంట్ వయసు పెంపును విరమించుకోవాలి'

నెల్లికుదురు జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు నిర్ణయాన్ని విరమించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంఘ శ్రీనివాస్ కోరారు. ఆలేరు పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిటైర్‌మెంట్ వయసు పెంచడంతో నిరుద్యోగులకు అన్యాయం జరగుతుందన్నారు. ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించలేకనే రిటైర్‌మెంట్ వయస్సు పెంపుననకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రిటైర్‌మెంట్ వయసు 61 సరిపోతుందన్నారు. టీచర్లు బిక్షపతి, రవి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లికుదురు, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : నైనాలలో పెరమాండ్ల జగన్నాథం స్మారకార్థం గాయత్రి గ్రానైట్స్‌సహకారంతో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు గురువారం బహుమతుల ప్రదానం చేశారు. సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి బానాల యాకయ్య, ఇసంపెల్లి సైదులు ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు,యాసం రమేష్, పెరమాండ్ల తిలక్‌బాబు, జగన్ చిర్ర సత్యనారాయణ, తోట శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు

కేసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంగడి ప్రాంతంలో గురువారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో వరంగల్ డాప్క్, ములుగు దిశ సంస్థల సమన్వయంతో మొబైల్ వ్యాన్ ద్వారా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 63 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శాంతరాజ్ తెలిపారు. సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు, జాటోత్ బిక్షపతి డిమాండ్ చేశారు. గురువారం తొర్రూరులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తామని మోసం చేశారని విమర్శించారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న ఖమ్మం, వరంగల్ జిల్లా కమిటీ సదస్సు ఖమ్మంలో నిర్వహిస్తారని, ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సురేష్, యుగంధర్, నర్సింహులు, మల్లేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీనెల 1వ తేదీన వేతనాలు అందించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మునిసిపల్ కార్మికుల చేత రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న మహబూబాబాద్‌లో జరుగు తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్ యూనియన్ రెండో మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి వీరన్న, వెంకన్న, మధు, సుభాష్, శ్రీను, మహేందర్, లక్ష్మి, రాణి, సుజాత, వెంకటమ్మ, సరిత పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి : టీపీటీఎఫ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 19న నిర్వహించనున్న నూతన ఉపాధ్యాయుల అవగాహన సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత అన్నారు. మహబూబాబాద్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం నూతన ఉపాధ్యాయుల అవగాహన సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో డీఎస్సీ-2024లో కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో 'ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర-సమకాలిన కర్తవ్యాలు' అనే అంశంపై ఏపీటీఎఫ్ పూర్వరాష్ట్ర అధ్యక్షుడు ఈ.నరసింహారెడ్డి, వృత్తి నిబద్ధత-పాఠశాలల పరిరక్షణ అనే అంశంపై టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మైస శ్రీనివాసులు ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బలాష్టి రమేష్, చుంచు శ్రీశైలం, బొల్లం శ్రీనివాస్, చీకటి ఉపేందర్, రాచకొండ ఉపేందర్, శ్రీనివాస్, రాజు, అంజయ్య, సదయ్య, కార్తీక్, మురళీ పాల్గొన్నారు.



టీపీటీఎఫ్ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయుల అవగాహన సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు పూలు అందిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారులు

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణా అధికారి జైపాల్‌రెడ్డి, మానుకోట రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రాతా మాసోత్సవాలనుపురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనదారులు పూలు అందించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించి, వాహనాలను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానుకోట రూరల్ సీఐ సర్వయ్య, ఎంవీఐలు ఎం.సాయిచరణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వే షురూ

(5వ పేజీ తరువాయి)

పర్యటించారు. అధికారుల వెంట తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మంగయ్య, ఏవో రామారావు, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు. గూడూరులో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ఏవో అబ్దుల్‌మాలిక్, ఆర్ఐ మల్లయ్య పర్యటించారు. ఇనుగుర్తిలో జూనియర్ అసిస్టెంట్ నర్సింహారావు, కేసముద్రంలో ఆర్ఐలు బాబు, సౌజన్య, ఏఎస్‌వో వేణు, డిప్యూటీ తహసీల్దార్ ఎర్రయ్య, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, మరిపెడలో తహసీల్దార్ సైదులు, స్పెషల్ ఆఫీసర్ కిరణ్ పాల్గొనగా, నెల్లికుదురులో ఎమ్మెల్యే మురళీనాయక్,ఎంపీడీవో బాలరాజు, ఎంపీవో కె.రాజు, ఏవో యాస్మిన్, పెద్దవంగరలో మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో స్వామినాయక్, ఏఈవోలు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల మహబూబాబాద్, చిన్నగూడూరు, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లో సర్వేను పరిశీలించారు.



కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్న గాంధీనగర్ జట్టు

గ్రామాల్లో కబడ్డీ, ముగ్గుల పోటీలు

కేసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూసపల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కబడ్డీ, ముగ్గుల పోటీలను నిర్వహించారు. కబడ్డీలో గాంధీనగర్ టీం ప్రథమ స్థానం సాధించగా, ఎస్‌కేఎస్ అకాడమీ అధినేత బలవంతుల సాయిరాజ్ రూ.10వేలు, తాళ్లపూసపల్లి టీం ద్వితీయ స్థానం సాధించగా బీజేపీ నాయకుడు బండి శ్రీను రూ.5వేలు నగదు బహుమతిని బుధవారం రాత్రి అందజేశారు. కేసముద్రం విలేజిలో 18 మంది బాల్యమిత్రులతో ఏర్పాటైన కనుమ గ్యాంగ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో ఏర్పాటైన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, సంకెపల్లి జనార్ధన్‌రెడ్డి, కముటం శ్రీనివాస్, మాసాడి అశోక్, కాటం సుజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

'పింఛన్లు మంజూరు చేయాలి'

కేసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా అర్హులైన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ఎంసీపీఐ (యూ)జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని వందలాది మంది గ్రామాల్లో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నూతన పింఛన్లపై పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే నూతన పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎసల్ల ఐలయ్య, రాజబోయిన యాకస్వామి, యార యాకయ్య, కంకల ఉప్పలయ్య, రాజబోయిన వెంకన్న, కంచ రాముడు, పార్టీ నాయకులు బొల్లోజు రాంమోహనాచారి, ధరావత్ రమేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సాయం

ఇనుగుర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిపల్లిలో ఇటీవలె మృతి చెందిన నీలం వెంకన్న కుటుంబానికి గురువారం ఆ గ్రామ ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లం అజయ్, పిట్టల అనిల్, నవీన్, మల్లం యాకయ్య, మాజీ సర్పంచ్ నీలం యాకయ్య, వెంకన్న, సుధాకర్, సతీష్, ఉప్పలయ్య, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రవి, పరమేష్, శివసాయి పాల్గొన్నారు.

ఆరు లీటర్ల గుడుంబా పట్టివేత

డోర్నకల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరుమాండ్ల సంకీసలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న సైదమ్మ అనే మహిళ వద్ద నుంచి ఆరు లీటర్ల గడుంబాను స్వాధీనం చేసుకుని, సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, నల్లబెల్లం తరలింపు యత్నించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

రాములమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

● న్యూ డెమోక్రసీ జాల్లా కార్యదర్శి గౌని ఐలయ్య

గార్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పీడిత తాడిత ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం సాగించిన ఇమ్మడి రాములమ్మ అమరత్వం శ్లాఘనీయమని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. గురువారం పీవోడబ్ల్యూ మండల నాయకురాలు ఇమ్మడి రాములమ్మ సంతాప సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండలంలోని గోపాలపురంలో దోపిడీ సమాజం అంతం కావాలని అలుపెరగని పోరాటం సాగించిన రాములమ్మ పోరాట స్ఫూర్తిని నేటితరం కార్యకర్తలు ప్రజాఉద్యమాలు చేపట్టి ఆమె చూపిన బాటలో కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీ రాష్ట్ర నాయకులు బండారి ఐటయ్య, జడ సత్యనారాయణ, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు, సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, గౌని భద్రయ్య, వీరన్న. సాంబరాజు, అనిల్, కరుణాకర్, రమేష్, కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాణాకు చేరిన కోళ్ల చోరీ పంచాయితీ?

దంతాలపల్లి, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల జరిగిన నాటుకోళ్ల చోరీ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు సమాచారం. అయా గ్రామశివారులో వ్యవసాయ బావుల వద్ద పెంపకం షెడ్లవద్ద ఉన్న పలువురి నాటుకోళ్లను ఆరుగురు మైనర్లు చోరీకి పాల్పడ్డట్లు సమాచారం. కాగా, జరిగిన ఘటనపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో పెద్దమనుషుల సమక్షంలో రూ.20వేల జరిమానా విధించినట్లు తెలిసింది.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జమాండ్లపల్లిలో నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ టోర్నీలో ముత్యాలమ్మగూడెం, జమాండ్లపల్లి జట్లు ఫైనల్లో తలపడ్డాయి. ముత్యాలమ్మగూడెం జట్టు జమాండ్లపల్లి జట్టుపై గెలుపొందింది. ముత్యాలమ్మగూడెం జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.15,116 ప్రథమ బహుమతి, రన్నర్‌ఎగా నిలిచిన జమాండ్లపల్లి జట్టుకు రూ.8,116లను నగదును నామిరెడ్డి వెంకట్‌రెడ్డి-పార్వతమ్మల జ్ఞాపకార్థం నామిరెడ్డి సీతారామిరెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఎస్సై దీపికరెడ్డి, గ్రామస్థులు కర్నూరపు నరేష్, పిట్టల నవీన్, చిట్టోజు సాయి, అంబాల గోవర్ధన్, కుక్కముడి వెంకన్న, బండి వెంకన్న, సింగంశెట్టి బాబురావు, అంబాల శివ పాల్గొన్నారు.



తహసీల్దార్ ఎదుట గుడుంబా తయారీదారులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుడుంబా తయారీదారుల బైండోవర్

సీరోలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపైదాడులు చేసి, 5 గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి సీరోలు మండలంలోని మన్నెగూడెం, కొత్తతండ, సాదుతండాల్లో ఎక్సైజ్, డీటీఎఫ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 21 లీటర్ల గుడుంబా, 1000 లీటర్ల బెల్లం పానకం, 25 కేజీల బెల్లం, 5 పటికను స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సాదుతండాకు చెందిన వాంకుడోతు సేవియా, ఆంగోతు బిచ్చు, కొత్తతండాకు చెందిన బానోత్ సంతోష్, ఆంగోతు భద్రమ్మ, మన్నెగూడెంకు చెందిన పుట్ట నాగరాజుపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ శారద ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈదాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, మౌనిక, డీటీఎఫ్ ఎక్సైజ్ ఎస్సై కిరిటి, సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

తొర్రూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. అమ్మాపురం గ్రామానికి చెందిన కొలిపాక లచమ్మ (110) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వృద్ధురాలి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

● రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నెహ్రూనాయక్

డోర్నకల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడానికి కార్యకర్తలు కంకణబద్ధులై ఉండాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాలోతు నెహ్రూనాయక్ అన్నారు. గురువారం డోర్నకల్ ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అకుంటిత దీక్షతో గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కె.కోటిలింగం, ఎల్లావుల హరికృష్ణ, నందానాయక్, దాసరి నాని, కోబల్‌నాయక్, డీఎస్ జగదీష్, మాద శ్రీనివాస్, సుశీల్‌కుమార్‌జైన్, రెడ్డబోయిన బాస్కర్, బద్రినాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన బెల్లకొండ శివకుమార్ (25), బొమ్మరబోయిన సోమన్న (35) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం మృతులకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ నాయకులను కోరారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదన్నారు. ఆబీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాంసుధీర్, సంజయ్, కనుకుంట్ల వెంకన్న, రాసాల సమ్మయ్య, కోట అశోక్, క్రిష్ణమూర్తి, సోమనర్సయ్య, కొమురయ్య, దిలీప్‌కుమార్, సోమన్న, చింత కర్ణకర్, యాకుబ్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు